క్లుప్తంగా

వైభవంగా విజయదుర్గ తీర్థం

కపిలేశ్వరపురం: అంగరలోని విజయదుర్గ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయం వద్ద తీర్థం నిర్వహించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి కొలువుల మల్లికార్జునరావు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారికి నైవేద్య సమర్పణతో నేడు జాతర ఉత్సవాలు ముగియనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించడంతో పాటు నూతన ఆధార్ నమోదు కోసం ప్రత్యేక నవీకరణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.రత్న కుమారి తెలిపారు. సచివాలయాల పరిధిలోని చిన్నారుల తల్లిదండ్రులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమ, మంగళ వారాల్లో పడమర ఖండ్రిక, నేలటూరు, మాచర గ్రామ సచివాలయాల్లోనూ, 28న వల్లూరు, కపిలేశ్వరపురం, టేకిలలోనూ శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్రలు ఆధార్ వివరాలను నవీకరణ చేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

టెన్నీ కాయిట్‌లో మెరిసిన విద్యార్థులు



ట్రోఫీలతో విజేతలు

మండపేట: 42వ అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి టెన్నీ కాయిట్ క్రీడలో మండపేట విద్యార్థులు సత్తా చాటారు. తూర్పు గోదావరి జిల్లా చిట్యాల గ్రామంలో ఈ నెల 21న ప్రారంభమై 22 వరకూ రెండ్రోజుల పాటు జరిగిన పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు పిల్లి రామారావు, వద్దాది వినయ్, లేగా త్రిమూర్తులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నట్టు కోచ్, కాకినాడ జిల్లా టెన్నీ కాయిట్ అసోసియేషన్ కార్యదర్శి కుంచె రమేష్ శనివారం తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఈ విజేతలు ముగ్గురు ఎంపికైనట్టు చెప్పారు. ఈ పోటీలు ఈ నెల 25 నుంచి 29 వరకూ జరుగనున్నట్టు వివరించారు. ఏపీ టెన్నీకాయిట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రామారావు, జిల్లా ప్రెసిడెంట్ కృష్ణ కుమారి, సభ్యులు నాగేశ్వరరావు, రామారావులు అభినందించారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ ప్రధాన రహదారిలోని తాజ్ రెస్టారెంట్ అరుగుపై శనివారం ఉదయం ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి ద్రాక్షారామ పోలీసులకు సమాచారం ఇచ్చారు. విచారణలో సదరు వ్యక్తి వెలంపాలేనికి చెందిన కార్పెంటర్ దేవాదుల చంద్రరావు(45)గా గుర్తించారు. మృతుని సోదరుని కుమారుడు సురేష్ ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడు చంద్రరావు గత పదేళ్లుగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. మద్యానికి బానిసై బయట తిరుగుతూ ఉంటాడు. ఇంటికి అప్పుడప్పుడూ వచ్చి వెళుతుండేవాడు. అతడికి కుమారుడు ఉన్నాడు. హోటల్ వద్ద మృతి చెంది ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

మండపేట: రూరల్ మండలంలోని 12 గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఈవోపీఆర్డీ దాసరి శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీరాజ్ డెవలప్మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టామని ఆయన శనివారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామాల శుభ్రతకు కృషి చేస్తారన్నారు. ఇంటింటా తిరుగుతూ పారిశుధ్యంపై స్థానికులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో సత్యనారాయణమూర్తి సూచనలతో మండలంలోని పలు గ్రామాల్లో తాను పర్యటించి కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందికి సూచనలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అర్తమూరులో కార్యదర్శి అనిల్‌కుమార్ గ్రామంలో పర్యటించి అవగాహన కల్పించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు.

అన్న క్యాంటీన్ పరిశీలన

రామచంద్రపురం: అన్న క్యాంటీన్ల ద్వారా ప్రజలకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందిస్తున్నట్లు రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. పాత బస్టాండ్ వద్ద గల అన్న కాంటీన్‌ను శనివారం సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారపూడి రైల్వే స్టేషన్ సమస్యలపై ఎంపీ ఆరా

మండపేట: ద్వారపూడి రైల్వే స్టేషన్లోని సమస్యలపై అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ ఆరా తీశారు. ద్వారపూడి టీడీపీ నాయకుడు యరగతపు బాబ్జి, ఇతర గ్రామ నాయకులు ఆయనకు ద్వారపూడి రైల్వే స్టేషన్‌కు సంబంధించిన పలు సమస్యలు వివరించారు. రైళ్ల రాకపోకలను తెలిపే డిస్‌ప్లే బోర్డులు పనిచేయడం లేదని, మంచినీటి సదుపాయం లేదని, ప్రయాణికులకు నిరీక్షణ గదులు లేవని తెలిపారు.

శివ పూజకు వేళాయె..

- మహా శివరాత్రికి ముస్తాబవుతున్న ఆలయాలు
- ఉత్సవాలకు సిద్ధమవుతున్న సోమేశ్వరాలయం
- హైందవ సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తున్న చారిత్రక ఆలయాలు



సోమేశ్వరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం



బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

రాయవరం: చారిత్రక శివాలయాలు మహా శివరాత్రి పర్వదినానికి ముస్తాబవుతున్నాయి. మండలంలోని సోమేశ్వరం, వెంటూరు గ్రామాల్లోని సోమేశ్వరాలయాలను చంద్రుడు ప్రతిష్ఠ చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. చారిత్రక ప్రాశస్త్యాన్ని సంతరించుకుని భక్తుల నీరాజనాలు అందుకుంటున్నాయి.

ఉగ్రతాపాన్ని ఉపశమింపజేసేందుకే

ద్రాక్షారామ భీమేశ్వరునికి వాయువ్యాన సోమేశ్వరాలయం, పడమట దిక్కున వెంటూరు సోమేశ్వరాలయాలు ఉన్నాయి. ద్రాక్షారామలో స్వయంభువుగా వెలసిన భీమలింగాన్ని ప్రత్యక్ష సాక్షి సూర్య భగవానుడు ప్రతిష్ఠించి ప్రథమార్చన గావించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. అంతర్వాహినిగా ఉన్న సప్త గోదావరి పుష్కరిణిలోని పవిత్ర జలంతో సప్త ఋషులు స్వామిని అభిషేకించారు. సూర్య ప్రతిష్ఠ కారణంగా భీమేశ్వరునిలో నెలకొన్న ఉగ్రతాపాన్ని ఉపశమింప జేయడానికి ఆగమ సంప్రదాయం ప్రకారం దిక్కులందే కాక విదిక్కులందు సైతం అష్ట సోమేశ్వరాలయాలను చంద్రుడు ప్రతిష్ఠించినట్లుగా చెబుతారు.

సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయాన్ని 1860లో మండపేటకు చెందిన నాళం భీమయ్య వంశీకులు పునర్నిర్మించినట్లుగా అదే వంశానికి చెందిన వారు



వెంటూరులో కొలువైన ఉమా సోమేశ్వరస్వామి

1933లో ఈ ఆలయాన్ని పునరుద్ధరించినట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. ఆలయ గోడలపై పురాతన కాలంనాటి లిపి కూడా చెక్కబడి ఉంది.

ఈ ఆలయంలో మహా శివరాత్రి, భీష్మ ఏకాదశి ఉత్సవాలను స్థానికులు ఘనంగా జరుపుతారు. వెంటూరులోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయానికి పౌరాణిక ప్రాశస్త్యంతో పాటు, చారిత్రక ప్రసిద్ధి ఉంది. 1604లో పెద్దాపురం సంస్థానాధీశుడైన హజీహుస్సేన్ ఆస్థానంలో దివానుగా పనిచేసిన నండూరి కామయ్య ఈ ఆలయాన్ని నిర్మించి, స్వామివారిని పునః ప్రతిష్ఠించినట్లు తెలుస్తోంది. గుంటూరు జిల్లా గరికపాడుకు చెందిన రుత్వికులు పునః ప్రతిష్ఠలో పాల్గొన్నారు. తదనంతరం శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని 1932లో నండూరి కామయ్య మంత్రి వంశానికి చెందిన నండూరి రాఘవరాజు పునర్నిర్మించగా, ఈ ఆలయానికి కావలసిన మండపాన్ని దువ్వూరి కొండయ్య కుమారులు పేరయ్య నిర్మించినట్లుగా తెలుస్తోంది. ఈ ఆలయ ప్రాశస్త్యాన్ని ఏనుగు లక్ష్మణకవి తాను రచించిన జాహ్నవీ మహత్యం కావ్యంలో విశేషంగా పేర్కొన్నారు. పురాతన కాలం నాటి ఈ చారిత్రక ఆలయాలు భక్తుల విశ్వాసాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి.

సోమేశ్వరంలో 47వ మహా శివరాత్రి ఉత్సవాలు..

మండలంలోని సోమేశ్వరంలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26న 47వ శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా వర్తక సంఘం ఆధ్వర్యంలో శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ ఏర్పాట్లు చేస్తున్నారు. మహా శివరాత్రి రోజున భారీగా బాణాసంచా కాల్చడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా కవలల దినోత్సవం



కవల జంటలతో ఎంఈఓ ఆంజనేయులు, ఉపాధ్యాయులు

కె.గంగవరం: మండల పరిధిలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో కవలల దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఇద్దరు కవల జంటలను ఎంఈఓ చోడిశెట్టి ఆంజనేయులు, హెచ్‌ఎం వెంకటేశ్వర రావు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు బ్రహ్మానందం తదితరులు అభినందించి కానుకలు అందించారు. పుట్టుకతో ఒకే పోలికతో ఉన్న వీరు చదువులో సైతం ఒకేలా రాణిస్తూ ఆశ్చర్య పరుస్తున్నారని తెలిపారు.

మురుగు కాలువలు నిర్మించాలి

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం శివారు ధనలక్ష్మీపేటలో మురుగు కాలువలు నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, స్థానిక నాయకుడు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ కార్యదర్శి నిమ్మితి విజయ్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏ ఒక్క వీధిలోనూ మురుగు కాలువలు లేకపోవటంతో ప్రజలు నానా పాట్లు పడుతున్నారన్నారు. ఇళ్లలోని వాడకం నీరు బయటకు పోవు మార్గం లేకపోవటంతో రోడ్డుపైకి చేరి బురదమయంగా మారుతోందన్నారు. వర్షాలు పడితే పరిస్థితి మరీ అధ్వానంగా మారుతుందని అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలని కోరారు.

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళదాం

వైఎస్ఆర్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: గడచిన ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో అమలు సాధ్యం కాని హామీలను ఇచ్చి తీరా గద్దెనెక్కిన తరువాత హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, వైఎస్సార్ సీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పిల్లి సూర్యప్రకాశ్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని గాంధీపేట పార్టీ కార్యాలయంలో నూతనంగా నియమితులైన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజవర్గ స్థాయి కమిటీలు ఏర్పాటు



కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్, ఎంపీ బోస్‌లను సత్కరిస్తున్న పార్టీ నేతలు

చేయాలని సూచించారు. ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, కె.గంగవరం మండల కన్వీనర్ పెట్టా శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. అనంతరం జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా నియమితులైన సూర్యప్రకాశ్‌ను రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా నియమితులైన సుభాష్ చంద్రబోస్‌లను పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు.

శివరాత్రి ఉత్సవ నిర్వహణపై అలసత్వం వద్దు

జిల్లా ఎస్పీ కృష్ణారావు

కె.గంగవరం: మహా శివరాత్రి పురస్కరించుకుని గోదావరి స్నానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కృష్ణారావు సూచించారు. మండల పరిధిలోని కోటిపల్లి ఫెర్రి, పుష్కర ఘాట్లు, సోమేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ప్రతి ఏటా మాదిరాగానే ఈ ఏడాది కూడా సుమారు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా ఉందని అందుకు తగ్గట్టుగా రేవులో ఏర్పాట్లు చేయాలన్నారు. ఆలయంలో క్యూలైన్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. డీఎస్పీ రఘువీర్, సీఐ వెంకట నారాయణ, ఎస్సై జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేద్దాం

కోటిపల్లి (కె.గంగవరం): మహా శివరాత్రి ఉత్సవాలను అందరి సహకారంతో విజయవంతం చేయాలని రామచంద్రపురం ఆర్డీఓ అఖిల పిలుపు నిచ్చారు. కోటిపల్లిలో కొలువైన శ్రీ ఛాయా



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

సోమేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 26న జరగబోయే మహాశివ రాత్రి ఉత్సవాల నిర్వహణపై శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత ఆమె శాఖల వారీగా ఏర్పాట్లపై రివ్యూ నిర్వహించారు. ఆర్టీసీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, పోలీస్, రెవెన్యూ శాఖలు భక్తుల కోసం చేసే ఏర్పాట్లను ఆర్డీఓకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా మహా శివరాత్రి ఉత్సవాలకు పలు ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు కోటిపల్లికి తరలి వస్తారని అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్టీసీ అధికారులు రాజమండ్రి, కాకినాడ, రావులపాలెం, రామచంద్రపురం, యానం తదితర



శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్డీఓ అఖిల

ప్రాంతాల నుంచి కోటిపల్లికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలన్నారు. వృద్ధులు, వికలాంగులు ఆలయం వద్దకు రావడానికి రవాణా శాఖ అధికారులు వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. డీఎస్పీ రఘువీర్, ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పెమ్మాడి బేబిసత్తిబాబు, దేవదాయ ధర్మాదాయ శాఖ రామచంద్రపురం డివిజన్ తనిఖీదారు బాలాజీ రాంప్రసాద్, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పిల్లి శ్రీను, అయినవల్లి అబ్బు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకన్న(రేవు శ్రీను), ఆలయ ఈఓ భీమశంకరం, ఎస్సై జానీ బాషా, మండల స్థాయి అధికారులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వంటల ప్రదర్శన

మండపేట: సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ సిస్టర్ సినీ జోసెఫ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన దేశ వ్యాప్త వంటల ప్రదర్శనకు మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వరప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రెండో వార్డు కౌన్సిలర్ చిట్టూరి సతీష్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ఫెస్టివల్‌ను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల్లో ప్రముఖంగా వండే వంటకాలను విద్యార్థుల తల్లిదండ్రులు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో భాగమేనన్నారు. తల్లిదండ్రులు తయారు చేసిన పలు రకాల వంటకాలు ఘుమ ఘుమలతో



ప్రదర్శనలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం

ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ షీబా, వైస్ ప్రిన్సిపాల్ మరియా, ఉపాధ్యాయులు ఎంట్రిసా, విజయ, వల్లూరి రామలక్ష్మి, రేవు మాలతి, పల్లి విజయభారతి, నాయకులు శెట్టి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ డీఈ శ్రీనివాస్, ఏఈ పవన్‌కుమార్, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజులను వెంట బెట్టుకుని గొల్లపుంత రోడ్డులోని వైఎస్సార్ కాలనీ, టిడ్కో కాలనీల్లో విస్తృతంగా పర్యటన చేశారు. కాలనీ వాసులు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. స్వచ్ఛ మండపేటగా తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం అవసరమన్నారు.



వైఎస్సార్ కాలనీ వాసులకు తడి,పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ రంగారావు

డ్రెయిన్లు, రోడ్లు శుభ్ర పరచడానికి, చెత్తను తీసుకెళ్లేందుకు పురపాలక సంఘంలోని పారిశుధ్య కార్మికులు నిత్యం శ్రమిస్తున్నారన్నారు. టిడ్కో సముదాయాల చుట్టూ పెరిగిపోయిన మొక్కలను తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్ల పక్కన పారేసిన బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను తొలగించే బాధ్యత యజమానులదేనన్నారు. పట్టించుకోని కొందరికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఏఈ ఆంజనేయులు, టౌన్ ప్లానింగ్, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, ఆర్పీలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కాజులూరు: యానం, ద్వారపూడి రహదారిలో కాజులూరు మండలం కోలంక శివారు గొప్పిరేవు వంతెనపై నుంచి టేకి డ్రెయిన్‌లోకి ఓ లారీ దూసుకుపోయింది. ఆ సమయంలో డ్రెయిన్‌లో పూర్తి స్థాయిలో నీరు లేకపోవటంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, క్లీనర్ గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి గొల్లపాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం తెల్లవారు జామున యానం నుంచి ద్రాక్షారామ వైపునకు వెళుతున్న లారీ అదుపు తప్పి గొప్పిరేవు వంతెనపై రైలింగ్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో టేకి డ్రెయిన్‌లోనికి దూసుకుపోయింది. అయితే లారీ పల్టీలు కొట్టకుండా నేరుగా డ్రెయిన్‌లోనికి దూసుకుపోవటం, ప్రమాద సమయంలో డ్రెయిన్‌లో పూర్తి స్థాయిలో నీరు లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది.



గొప్పిరేవు వంతెనపై నుంచి టేకి డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన లారీ

వాసవీమాతకు సమకూరిన ఉత్సవ వాహనాలు

- తీర్చిదిద్దిన మండపేట కళాకారుడు వాసా శ్రీనివాస్
- ప్రత్యేక వాహనంలో పెనుగొండకు తరలింపు

మండపేట: అనేక పుణ్య క్షేత్రాలకు వివిధ దేవతామూర్తుల కళారూపాలను తయారు చేయడంలో పేరొందిన మండపేటకు చెందిన వాసా శ్రీనివాస్ వాసవీమాతకు ప్రత్యేక వాహనాలను ఇత్తడిని ఉపయోగించి అద్భుతంగా తీర్చిదిద్దారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్ధిని, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం అధికారులు ఇచ్చిన ఆర్డరుపై అమ్మవారికి నంది వాహనం, శేష వాహనం, పందిరి వాహనాలను సుందరంగా తీర్చిదిద్దారు. వాసవీమాత జన్మస్థలమైన పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ అమ్మవారి దేవాలయంలో వీటిని ఉంచుతారు. శిల్పి శ్రీనివాస్ మాట్లాడుతూ పెనుగొండకు చెందిన దాత వేంద్ర పవన్‌చక్రవర్తి ఆర్డరుపై నంది, శేష, పందిరి వాహనాలను మేలిమి ఇత్తడితో



పెనుగొండ వాసవీమాత ఉత్సవాలకు సిద్ధమైన నంది, శేష, పందిరి వాహనాలు

తయారు చేశామని తెలిపారు. ఆరు నెలల పాటు నలుగురు శిల్పులు శ్రమించి వాటిని రూపొందించామని వివరించారు. శనివారం నేలటూరు రోడ్డులో ఉన్న తయారీశాల నుంచి ప్రత్యేక వాహనంలో ఆలయ అధికారులు, నిర్వాహకుల పర్యవేక్షణలో పెనుగొండ తరలి వెళ్లాయి.

శిరంగు శ్రీనుకు ఎమ్మెల్సీ తోట పరామర్శ

మండపేట: మాతృమూర్తిని కోల్పోయి విషాదంలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకుడు, కాపు అభ్యుదయ సంఘం నాయకుడు శిరంగు శ్రీనివాస్‌ను శాసన మండలి సభ్యుడు తోట త్రిమూర్తులు శనివారం పరామర్శించారు. 12వ వార్డులోని ఆయన నివాసానికి వెళ్లి స్వర్గీయ చంద్రావతి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ ప్రముఖుడు, ప్రముఖ వ్యాపారవేత్త బిక్కిన చిన్న పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో నాయకులు దుగ్గిరాల రాంబాబు, పెంకే వెంకట్రావు, పిఠాపురం సత్యనారాయణ, ముక్కా దాలయ్య, తాడి రామారావు, శెట్టి రవి కుమార్, కొంతం ప్రసాద్, పాలమాల సత్తిబాబు, కర్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు

మండపేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే ప్రమాదాలు తప్పవని రూరల్ సీఐ దొరరాజు హెచ్చరించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను విధిగా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. మండలంలోని కేశవరంలో రూరల్ ఎస్ఐ బుజ్జిబాబు ఆధ్వర్యంలో లారీ ఓనర్లు, డ్రైవర్లతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రయాణ సమయాల్లో డ్రైవర్లు ఎప్పటికప్పుడు సిగ్నల్స్ ను అనుసరిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మోటారు వెహికల్ చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ లైసెన్సు, ఇతర రికార్డులు కలిగి ఉండాలన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల ఫ్లారెన్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈఓలు వీరరాఘవరెడ్డి, వాసంశెట్టి నాగేశ్వరి మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి వార్షికోత్సవాలు వేదికగా నిలుస్తాయన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్త, దాత కొవ్వూరి వంశీమోహన్ కృష్ణారెడ్డి సహకారంతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాలకు నిత్యం సహకరిస్తున్న దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో 'వరల్డ్ థింకింగ్ డే'

రాయవరం: ప్రపంచ థింకింగ్ డేను పీఎంశ్రీ పాఠశాలల్లో శనివారం నిర్వహించారు. భారత స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఇప్పటికే భారత స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్లను కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 22న ప్రపంచ థింకింగ్ డేగా గైడ్ విద్యార్థులు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా పీఎంశ్రీ పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులు వరల్డ్ థింకింగ్ డే ను పాటించారు. ఈ ఏడాది 'అవర్ స్టోరీ' అనే థీమ్‌తో ప్రపంచ ఆలోచనా దినోత్సవాన్ని పాఠశాలల్లో నిర్వహించారు. జిల్లాలో ఉన్న 26 పీఎంశ్రీ పాఠశాలల్లో వరల్డ్ థింకింగ్ డే ను నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో వరల్డ్ థింకింగ్ డే కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలి

కపిలేశ్వరపురం: విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమాదేవి అన్నారు. పాఠశాలలో శనివారం స్కౌట్స్ అండ్ గైడ్స్ డేను నిర్వహించారు. తొలుత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ఆద్యుడైన రాబర్ట్ స్టీఫెన్ స్మిత్ బేడెన్ పవేల్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కు ఎంపికైన విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ చేశారు. హెచ్‌ఎం రమాదేవి మాట్లాడుతూ స్కౌట్ విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టారు రాయుడు ఉదయ్‌కుమార్, గైడ్స్ ఉపాధ్యాయిని మందా శిరోమణి, సహ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు అందరి బాధ్యత

కపిలేశ్వరపురం: ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా నివాసిత ప్రాంతాల నుంచి చెత్తను తొలగించే ప్రక్రియలో అందరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తించాలని పలు శాఖల అధికారులు అన్నారు. కపిలేశ్వరపురంలో చెత్త సేకరణపై అవగాహనా కార్యక్రమంలో భాగంగా శనివారం పారిశుధ్య కార్మికులు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈఓపీఆర్‌డీ మోహన్, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, కార్యదర్శి శివచక్రవర్తి మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యారోగ్య, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు, నివాసితులు పాల్గొన్నారు.